# అప్పారావు నోటు కథ

ఇంక ఏమీ వద్దు బిల్లు ఇవ్వమని సౌంజ్ఞ చేసాడు అప్పారావు సర్వర్‌ని ఉద్దేశిస్తూ.

కొత్తగా ఓపెన్ చేసిన హైక్లాస్ వెజిటేరియన్ హోటలది. దేశ జనాభా అంతా ఒకేచోట గుమిగూడినట్లు-ఇసుకేస్తే రాలనంత జనం.

ఏమిటో! ఎన్ని హోటళ్ళు ఉన్నా కొత్త హోటల్ ఒకటి వెలిసే సరికి జనం ఎందుకింత విరగబడి పోవటమో? అంతుపట్టని ప్రశ్నయి కూర్చుంది అప్పారావుకి ఆ రద్దీని చూస్తుంటే.

ఇంట్లో రోజూ తినేదే తింటుంటే అసలు రుచుల సంగతులు మర్చిపోకుండా చస్తారా ఏం? లేకపోతే వెధవ గోళీకాయల్లాంటి తను తిన్న ఈ మైసూరు బజ్జీలకి ఇంత రుచి ఎక్కడ్నించి వచ్చి ఉంటుంది!

ఇదే విషయం అలివేలు దగ్గిరంటే ఇంకేమయినా ఉందా!

కొత్త రుచులు ఎందుకురావు మహాశయా! మేము కొంపల్లో కష్టపడి చెమటోడ్చి చేస్తాం- ఆ హోటల్ వాళ్ళు చెమట ఝూడించి చేస్తారు. అయ్యా అప్పారావుగారు అది హోటల్ రుచికి కారణమని ఖండించిపారేస్తుంది భార్యారత్నం.

రెండు గ్లాసులు నీళ్ళు తాగి సర్వర్ అతి వినయంగా తీసుకొచ్చిన బిల్లుని చేతిలోకి తీసుకున్నాడు.

ప్లేట్ మైసూర్‌బజ్జీ నాలుగు రూపాయలా!! ఒక్కసారి ముక్కున వేలేసుకుందామనుకున్నాడుగాని డబ్బుపోతే పోయింది. తిన్న టిఫిన్ మాత్రం మహా రుచిగా ఉంది పోనీలే వెధవడబ్బు అని సరిపెట్టుకున్నాడు.

ఏమిటో ఇంట్లో ఎంత తిన్నా తిన్నట్లే ఉండదు. హోటల్లో ఒక్క టిఫిన్ తినేసరికి కడుపు నిండినట్లనిపిస్తుంది. ఎందుకబ్బా అలా అయిపోతుంది' అమాయకంగా తనని తానే ప్రశ్నించుకున్నాడు.

'బిల్లుని చూసేసరికి అలానే అయిపోతుంది. దాని కోసమని నువ్వు వర్రీ అయిపోకు' అన్నాడు ఆత్మారాముడు.

ప్రతిదానికి వీడొకడు! ఏమీ అనుకోనివ్వడు. ఆవిడగారే అనుకుంటే నాకు ఈ ఆత్మారాముడొకమొగుడు. తక్కున అలివేలు గుర్తుకొచ్చేసింది. భార్య ఇంత ఫ్రీక్వెంట్‌గా ఏ సందర్భంలో వడితే ఆ సందర్భంలో, అక్కడవడితే ఇక్కడ ఇలా గుర్తుకొచ్చేస్తే కష్టమై పోతోందనుకున్నాడు అప్పారావు.

కులాసాగా జేబులో చెయ్యి పెట్టాడు బిల్లుని వేరో చేత్తో పట్టుకుని.

ఓ ఐదు రూపాయల నోటు- ఇరవై రూపాయ నోటుని బయటకి తీసింది చెయ్యి. ఐదు రూపాయలనోటు అవ్వుడే ప్రింటింగ్ ప్రెస్‌లో నుంచి ఆకుపచ్చ పట్టుచీర కట్టుకుని వచ్చిన పెళ్ళికూతుర్లా మిలమిలా మెరిసిపోతోంది.

దుమ్ములో కొట్టుకుపోయి, వెలసిన ఇటుకలా, ఎండిన కొబ్బరిపీచులా ఉంది ఇరవై నోటు. వీటికి తోడు నోటు మధ్య కేన్సర్‌లాంటి కంత. ఇంక్రిమెంట్లు లేకుండా సర్వీస్ చేస్తున్న ఎన్‌జీవోలా ఉంది దాని వాలకం. ఆ నోటుని చూడంగానే తిన్న టిఫిన్ మళ్ళీ బయటకు వచ్చేస్తుందేమో అన్నంత ఫీలింగ్ కలిగింది అప్పారావుకి.

ఆ నోటుని మారుద్దామని దాదాపు రెండు వారాల్నించి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నో కొత్త నోట్లు వస్తున్నాయి, చేతులు మారుతున్నాయి. కాని ఈ నోటు మాత్రం తన లైఫ్ పార్ట్‌నర్‌లా వదిలించుకుందామనుకున్నా వదలటంలేదు. చూస్తూ, చూస్తూ ధైర్యంగా ఎవ్వరికీ ఇవ్వలేకపోతున్నాడు ఆ నోటుని. ఏదో రకమైన మొహమాటంతో తెగ ఇబ్బంది పడిపోతున్నాడు. అక్కడికి కొంత ధైర్యం చేసి ఓ రోజు చంటాడు చాక్లెట్లు వద్దంటున్నా వినక ఫాన్సీ షాపులో ఓ ఐదు రూపాయల చాక్లెట్లు తీసుకుని ఈ నోటుని అందించాడు.

కిండర్‌గార్డెన్ చదువుతున్న పిల్లాడిలా నఖశిఖపర్యంతరం ఆ నోటుని పరీక్షించి 'దూస్‌రాదేవ్' అంటూ మొహాన కొట్టాడు షాపువాడు.

తీసుకున్న చాక్లెట్లు వద్దంటే ఏం తిట్టిపోస్తాడో అని నిక్షేపంగా ఉన్న ఓ ఐదు నోటుని షాప్‌వాడికి అర్పించుకుని ఉసూరు మంటూ ఇరవై నోటుని విసురుగా జేబులో వేసుకున్నాడు.

ఆ మర్నాడు బస్సు కండక్టర్‌కి, ఆ తరువాత పాలవాడికి... మిర్చీ బజ్జీలమ్మే వాడికీ... ఇలా ఒకళ్ళేంటి కనపడిన ప్రతి వాళ్ళ దగ్గిర ఆ నోటుని వదిలించుకుందామని ప్రాక్టికల్స్ వేసాడు. ఆ నోటుని చూసిన ప్రతివాడు మంత్ర పుష్పం లాంటివి మరో రెండు చదివి ఆ నోటుకన్నా అసహ్యంగా మొహం పెట్టి అప్పారావుని దుయ్యబట్టారు. అయినా అప్పారావు విసుగు చెందని విక్రమార్కుడిలా ఆ నోటుని జేబులో అతి భద్రంగా దాచి అడపాదడపా మార్చటానికి ప్రయత్నిస్తూనె ఉన్నాడు.

అసలే వికృతాకారం-పైగా విపరీతమైన స్ట్రెయిన్. ఎన్నో ఇస్త్రీ మడతలకు తరచుగా గురి అవుతున్న ఇరవైనోటు అరవై ఏళ్ళ ఆడదానిలా తయారైంది. మధ్యలో ఏర్పడిన చిన్నకంత. ఈ మధ్యనే పెద్దదవటం ప్రారంభమైంది.

ఈ దరిద్రముండా నోటు అసలు చెల్లుతుందా లేదా అని అనుమానమొచ్చేసింది అప్పారావుకి. దీన్ని మార్చటం కోసం రిజర్వ్‌బ్యాంక్‌కి చావాలంటే... అప్పారావుకి చిర్రెత్తుకొచ్చింది. ఒక్కసారి ఆ నోటుని చింపేద్దామనుకున్నాడు.

కాని... క్యాన్సర్ వంటి మహమ్మారులకే చికిత్సలు వచ్చేసిన ఈ రోజుల్లో అఫ్టరాల్... ఈ నోటుని తను మార్చలేడా! తను అంత చవట కాదనుకున్నాడు.

"పొరబడుతున్నావు. నువ్వు అలా అనుకోవటానికి వీలులేదు. చవటవనే ఎవడో నీకిది అంటగట్టాడు. దీన్ని మార్చేదాకా నువ్వు దద్దమ్మవే..." ఈ ఇన్నర్ సోలొకటి! అరె! ఎంత సర్దుకుపోదామనుకున్నా పోనీయక మరీ వెధవని చేస్తోంది.

అప్పారావుకి ప్రెస్టేజి ఇష్యూ వచ్చేసింది. అంతరాత్మతో ఛాలెంజ్ చేసాడు. ఈ వారంలో చూస్తుండు దీన్ని ఎలాగైనా మార్చేస్తానని శపథం చేసాడు. అప్పటినుండి అప్పారావుకి, ఇన్నర్‌సోల్‌గాడికి మధ్య సింధూశాఖ యుద్ధం ప్రారంభమయింది.

అప్పారావు నెమ్మదిగా లేచాడు బిల్లుని చేతిలోకి తీసుకుని.

టేబుల్స్ దగ్గిరేకాదు- కౌంటర్ దగ్గిర కూడా జనం విపరీతంగా ఉన్నారు. క్యాషియర్ పవర్‌ఫుల్ మెగ్నిషియం బల్బులా మెరిసిపోతున్నాడు. బిల్లు తీసుకోవటం- సెకండ్ల మీద చిల్లర ఇవ్వటం- డబ్బు లెఖ్ఖ చూసుకోవటం, క్యాషియర్ పద్ధతిని చూస్తుంటే ఏదో మెజీషియన్ డబ్బుతో మ్యాజిక్ చేస్తున్నట్లనిపించింది అప్పారావుకి.

అక్కడి వాతావరణం, పరిసరాలు, జనసందోహం చూసి, సమయం, సందర్భం భలేగా కలిసొచ్చాయి ఈ నోటుని మార్చటానికని పించింది అప్పారావుకి.

తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో వడివడిగా కౌంటర్ దగ్గిరకి వెళ్ళి బిల్లుతీసి క్యాషియర్

ముందుంచి, దాని మీద అదోరకమైన స్మయిల్‌తో ఇరవైనోటు నుంచి, స్లైం వేస్టయిపోతున్నవాడిలా చేతి వాచి వంక విసుగ్గా చూడటం మొదలెట్టాడు.

అంత బిజీలోను క్యాషియర్ నోటుని నోటీస్ చేసినట్లనిపించింది అప్పారావుకి.

అంతరాత్మగాడు జార్జి బుష్‌లా నవ్వాడు.

అప్పారావుకి పిచ్చికోపం వచ్చింది. ఏదో తిట్టబోయాడు.

ఇంతలో...

ఆశ్చర్యం! క్యాషియర్ బాక్స్‌లో ఏడుస్తూ దూరిపోయింది ఇరవైనోటు నన్ను ఇలా వది లించేసుకుంటావా అన్నట్లు.

అప్పా న్న గుండె అదురుతోంది. ఏ కార్డియాలజిస్ట్ ... ష్ట్‌ వేగాలో అని మననం చేసుకుంటున్నాడు.

మరో ఇద్దరు క్యాష్ పే చేసి ఛేంజ్ తీసు కెళ్ళిపోయారు.

అవును! తను డబ్బిచ్చి రెండు నిమిషాలైంది. ఇంకా తనకు ఛేంజ్ ఇచ్చి చంపడే! లబక్... లబక్ అంటూ శబ్దం చేస్తున్న గుండెను కంగారు పడ ద్దని ధైర్యం చెప్పే స్థితిలో లేడు.

మినీ తిరుపతి మనీ కలక్షన్లా ఉంది క్యాష్ బాక్స్. బాక్స్‌లో అంతా రకరకాల రంగు నోట్లు-కళ్ళకి ప్రత్యక్షంగా కనిపిస్తోంది అప్పా రావుకి. ఆశ్చర్యం... తనిచ్చిన స్పెసిమిన్ నోటు ఎక్కడుందో కనపడటం లేదు.

దాంట్లో...

అలాగే గుడ్లప్పగిస్తూ క్యాషియర్ వంక అదో విధమైన దీనపు చూపు చూస్తూ కౌంటర్ దగ్గిరే నుంచున్నాడు.

'ఓ... సారీ' అంటూ అప్పారావు చేతిలో డబ్బు పెట్టాడు క్యాషియర్. మారు మాట్లాడ కుండా ఇచ్చిన డబ్బుని జేబులో పడేసుకుని మరీ తొందర తొందరగా నడిచి వెళ్ళిపోతే క్యాషి యర్ వెనక్కి పిలుస్తాడేమోనన్న భయంతో నెమ్మదిగా, అతి క్యాజువల్‌గా... లలలా లలలా లక్కీ ఛాన్సలే అని మనస్సులోనే పాడు కుంటూ... రేలంగిలా అడుగులు వేసుకుంటూ బయటపడ్డాడు అప్పారావు.

ఊయల లూగి యి మనస్సు... ఎప్పుడో భానుమతి పాడిన పాట గుర్తు కొస్తోంది అప్పారావుకి.

అలివేలు చంటాడితో సహా పుట్టింటికి వెళ్ళి నప్పుడు కూడా ఇంత ఆనందం తను పొంద లేదు.

ఇన్నాళ్ళికి దరిద్రం వదిలింది. తను గెలిచాడు-చవటకాదని నిరూపించుకున్నాడు.

టిఫిన్ తిన్న మత్తులో ఇన్నర్‌సోల్‌గాడికి నిద్రపట్టినట్లుంది... నవ్వుకున్నాడు అప్పా రావు.

అప్పారావు గాలిలో తేలిపోతున్నాడు.

అతనిలో ఏదో విజయగర్వం.

జాక్‌పాట్ కొట్టినవాడిలా తెగసంబరపడి పోతున్నాడు. ఓ జర్దాపాన్ వేసుకుని, తన బ్రాండ్ సిగిరెట్టు లాగిస్తేనేకాని తగినంత శాంతి జరగదని నిర్ణయించుకుని ఎదురుగా కనబడుతున్న కిళ్ళీ షాప్ వైపు దారి తీసాడు హుషారుగా ఈలవేసుకుంటూ.

అదేదో దండకం చదివి పాన్ కట్టమని జేబులోనుంచి డబ్బు తీసాడు.

అంతే...

ఓ పదినోటు... ఐదునోటు మరో రూపాయి నోటు... బురదగుంటలో బాగా ఊరినాని ఎండిన కాయితాల్లా ఉన్నాయి. గల్ఫ్‌వార్‌లో సముద్రంలో కలిసిపోయిన ఆయిల్నంతా వీటి కోనే అద్దారా అన్నట్లున్నాయి వాటి వాలకాలు.

అసలు ఈ కరెన్సీ ఇండియాదేనా? అను మానమొచ్చింది ఆ నోట్లని చూసిన అప్పా రావుకి ఏం చేయాలో తెలీక అలానే నిలుచుండి పోయాడు అప్పారావు. ●

